క్లుప్తంగా

ఆదాయ ధ్రువీకరణ విషయంలో వాగ్వాదం

దమ్మపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆదాయ ధ్రువీకరణ పత్రం విషయంలో ఆర్ఐ, దరఖాస్తుదారుడికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మండలంలోని లచ్చాపురం గ్రామానికి చెందిన భూక్యా నాగేంద్ర ఆదాయ ధ్రువపత్రం కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు అందజేశాడు. దరఖాస్తుడి భార్య ప్రభుత్వ ఉద్యోగి అయినందున రూ.1,50,000లోపు ఆదాయం ఉన్నట్టుగా రిపోర్టు రాయలేనని ఆర్ఐ వీరాస్వామి చెప్పడంతో నాగేంద్ర ఆర్ఐను దుర్భాషలాడగా, ఇరువురు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. గమనించిన ఉద్యోగులు, స్థానికులు వారిని వారించి, సర్దిచెప్పారు. కాగా దరఖాస్తుదారుడు ఆదాయ ధ్రువపత్రం విషయంలో ఆర్ఐ తనను లంచం ఇవ్వాలని డిమాండ్ చేసి, దాడి చేశాడని ఆరోపిస్తూ, అదేవిధంగా నాగేంద్ర తన విధులకు భంగం కలిగించి, దుర్భాషలాడాడు అని ఆరోపిస్తూ, ఆర్ఐ ఇరువురు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బహుళ అంతస్తులపై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

భద్రాచలంటౌన్: ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా భద్రాద్రిలో అక్రమంగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలపై ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక (జేఏసీ) నాయకులు, ఆదివాసీ అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పట్టణంలోని ఎలాంటి అనుమతులు లేకుండా, ఏజెన్సీ చట్టాలను అతిక్రమించి కొందరు బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారన్నారు. ఆరు అంతస్తుల భవనం కూలిన ఘటనకు సంబంధించి భవన యజమాని శ్రీపతి శ్రీనివాస్‌తో పాటు ఆయనకు సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం పరిధిలో కొందరు వ్యాపారాలకు సత్రాల పేర్లతో బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

కారకులను శిక్షించాలి..

భద్రాచలంటౌన్: పట్టణంలో నిర్మాణంలో ఉన్న భవనం కూలి ఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటనలో కారకులను కఠినంగా శిక్షించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కెచ్చల రంగారెడ్డి అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా భవనం నిర్మిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసి విధులపై నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, కెచ్చల కల్పన, మునిగేలా శివప్రశాంత్, గోపాలరావు, సతీష్, అయోధ్య, ఇజ్రాయిల్ ఉన్నారు.

పరామర్శ..


పరామర్శిస్తున్న రేగా కాంతారావు

ములకలపల్లి: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావును పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పరామర్శించారు. అప్పారావు సోదరుడు రమేశ్ ఇటీవల మృతి చెందగా శనివారం సూరంపాలెం గ్రామంలోని ఆయన స్వగృహానికి వెళ్లి రమేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోశం నర్సింహారావు, బొలిశెట్టి నవీన్, కుంజా వెంకట్, ముదిగొండ శ్రీను, వీరమల్ల వెంకన్న, తానం కృష్ణ, యేసుపాక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన జినక ప్రభాకర్ శనివారం మృతి చెందగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి దహన సంస్కారాలకు ఆర్థికసాయం అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, మణుగూరు మాజీ జెడ్పీటీసీ పోశం నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలుచేయాలి

దమ్మపేట: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరుగ్యారంటీలను తప్పనిసరిగా అమలు చేయాలని సీపీఎం నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ముష్టిబండ గ్రామంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టల అర్జున్, దొడ్డా లక్ష్మీనారాయణ, అప్పారావు, శ్రీనివాసరావు, కేశవరావు, కొప్పుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయం ఉట్టిపడేలా..


పట్టు పరికిణీల్లో అమ్మాయిలు



- తెలుగుదనం ప్రతిబింబించేలా వస్త్రాలంకరణ
- చీర, పట్టుపరికిణీ, లంగావోణీలతో పండుగ శోభ
- పాతతరాన్ని గుర్తుచేస్తున్న అతివలు

నేడు ఉగాది వేడుకలు

సండే స్పెషల్

బూర్గంపాడు: పంచె కట్టు.. చీరకట్టు.. పట్టు పరికిణీ తెలుగువారి వస్త్రధారణకు ప్రతీక. ఆధునిక సమాజంలోనూ యువత సంప్రదాయ దుస్తులు ధరించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పండుగలు వచ్చాయంటే ముఖ్యంగా అమ్మాయిలు పట్టు పరికిణీలు ధరించేందుకు ప్రాధాన్యతనిస్తారు. గతంలో పట్టు పరికిణీలు, లంగావోణీలు ధరించిన అమ్మాయిలు కొన్నేళ్ల వరకు మోడ్రన్ డ్రెస్సుల్లో మోజులో పడ్డారు. కానీ ప్రస్తుతం సంప్రదాయ దుస్తులనే ధరించడానికి ఇష్టపడుతున్నారు. ఆదివారం ఉగాది సందర్భంగా పల్లెల్లో, పట్టణాల్లో అమ్మాయిలు తెలుగుదనం ప్రతిబింబించేలా సంప్రదాయ దుస్తులలో అలరించనున్నారు.

అవగాహన అనివార్యం..

విస్తరిస్తున్న పాశ్చత్య సంస్కృతికి ఆకర్షితులు కాకుండా పిల్లలకు కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ మేరకు యువతకు సంప్రదాయబద్ధమైన అంశాలపై అవగాహన కల్పించడంతోపాటు పండుగల సమయంలో తెలుగు సంస్కృతీ సాంప్రదాయాలను తెలియజేస్తున్న క్రమంలో దుస్తుల ఉపయోగంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సైతం అవగాహన కల్పిస్తున్నారు. ఇదే సంప్రదాయాన్ని పాటిస్తూ యువత తమ పాఠశాలలు, కళాశాలల్లో జరిగే వివిధ కార్యక్రమాల్లో సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొంటుండటం తెలుగు సంప్రదాయాలపై వారికి ఉన్న మక్కువ అర్థమవుతోంది. ఇలా ముందు తరల వారికి సంస్కృతిని అందించడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సిన అవరముంది.

విశేషం ఏదైనా ధరించాల్సిందే..

పండుగలు, వివాహాది శుభకార్యాలు విశేషం ఏదైనా అమ్మాయిలు పట్టు పరికిణీలతో ముస్తాబవుతున్నారు. ప్రధానంగా పండుగ రోజులైన ఉగాది, దసరా, దీపావళి, వినాయక చవితి, శ్రీరామనవమి పండుగలతోపాటు ఇళ్లల్లో శుభకార్యాలు, పాఠశాలలు, కళాశాలల్లో పలు కార్యక్రమాలు నిర్వహించే క్రమంలో సైతం యువత సంప్రదాయ దుస్తులు ధరిస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం పండుగ అయినా, విశేషమైన, ప్రాముఖ్యత కలిగిన రోజుల్లో సంప్రదాయ దుస్తులు ధరిస్తూ పాతతరాన్ని గుర్తు చేస్తున్నారు.

సంప్రదాయ దుస్తులు ధరించాలి



పండుగలకు, శుభకార్యాలకు అమ్మాయిలు సంప్రదాయ దుస్తులు ధరించేందుకు ఆసక్తి చూపుతున్నారు. పల్లెలు, పట్టణాల్లో కూడా మహిళలు చీరలు, అమ్మాయిలు పట్టు పరికిణీలు వేసుకునేందుకే ఇష్టపడుతున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునే క్రమంలో వస్త్రధారణకు తప్పనిసరిగా ప్రాధాన్యతనివ్వాలి.

– నాగభవాని, సారపాక

పట్టు పరికిణీలే ఇష్టం



పండుగలప్పుడు పట్టు పరికిణీ వేసుకోవటమే ఇష్టం. పరికిణీ వేసుకుంటే ఏదో తెలియని గొప్ప అనుభూతి కలుగుతుంది.చూసేందుకు కూడా బావుంటుంది. పట్టు పరికిణీ వేసుకుంటే అందరు బాగుందని చెబుతారు. పండుగలప్పుడు, పెళ్లిళ్లకు, శుభ కార్యాలకు తప్పకుండా పట్టు పరికిణీలే వేసుకుంటాను.

– దీపికారెడ్డి, రెడ్డిపాలెం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లోని ప్రజలు వివిధ కారణాలతో వైద్యచికిత్సలు చేయించుకుని ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అభ్యర్థించిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుడగం శ్రీనివాస్, నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం..

భద్రాచలం పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో ఓం శ్రీ సాయి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంజనేయ శాస్త్రి, జగన్మోహనరావు, సుబ్బారాజు, శ్రీనివాసరావు, నాగు, చిన్నారావు, శ్రీను, వెంకన్న, యోగేష్, శంకర్, కళావతి, ధనలక్ష్మి, రమాదేవి, జయంతి, విజయ, రమణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని రెవెన్యూ కాలనీలో అగ్నిప్రమాదంలో సర్వ కోల్పోయిన కటారి సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాదానికి గురైన ఇంటిని శనివారం నాయకుల పరిశీలించి కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకన్న, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి

ములకలపల్లి: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని పాస్టర్స్ ఫెలోషిప్ మండల కమిటీ గౌరవాధ్యక్షుడు జి.రాజారత్నం, అధ్యక్షుడు టి.ఎలియాజరు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో శనివారం ములకలపల్లిలో శాంతి ప్రదర్శన చేశారు. అనంతరం తహసీల్దార్ గుడ్ల పుల్లారావుకు, ఎస్సై కిన్నెర రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం కార్యదర్శి బి. ప్రసాద్, ట్రెజరర్ జి. నతానియేల్, ఎలీసా, మోషే, ఏసుదాసు, జ్యోతికుమార్ ఉన్నారు.

చర్ల: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి దోషులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని చర్ల మండల క్రీస్తు రాయబారుల సహవాసం డిమాండ్ చేసింది. ఈ మేరకు మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు ఉన్నారు.

పరశురాం పరివార్ ఆధ్వర్యంలో వేడుకలు


ఉగాది విశిష్టతను తెలియజేస్తున్న అర్చకులు

బూర్గంపాడు: సారపాకలోని లక్ష్మీ గణపతి ఆలయంలో పరశురాం పరివార్, విశ్వ హిందూ మహాసంఘ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో అమ్మవారికి కుంకుమార్చన, లలితా పారాయణం, గోపూజ నిర్వహించారు. బాల త్రిపుర సుందరి దేవి రూపంలో చిన్నారికి పాద పూజ చేశారు. అర్చకులు ఉగాది విశిష్టత, సనాతన ధర్మపరిరక్షణపై ప్రవచనాలు చేశారు. ఆధ్యాత్మిక అంశాలపై క్విజ్ నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ మహాసంఘ్ జాతీయ ధర్మ ప్రచార ప్రకోష్ట్ వేదాంత గోవిందా రామానుజాచార్యులు, పరశురాం పరివార్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షులు బాలాజీ, ముత్తవరపు రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు సాయి కిరణ్ శర్మ, ప్రధాన కార్యదర్శి కరకు ప్రసాద్, దయానంద దత్త, జయప్రసాద్, బాలరామరాజు, జయ, భవాని, లక్ష్మీ, ఇందు, సునీత పాల్గొన్నారు.

ఘనంగా కవి సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న కవులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మాగంటి కళా పీఠం వారి నిర్వహణలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదిన సందర్భంగా కవి గాయక సమ్మేళనం కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 40 మంది కవులను సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు కవులు ఆలపించిన గీతాలు, కవితలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల కో–డైరెక్టర్ మాగంటి సాయిసూర్య, గొల్ల భూపతిరావు, తిప్పన సిద్దులు, చిట్టి లలిత, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ట్రాక్టర్ పట్టివేత

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారం క్రాస్ రోడ్డు వద్ద బొగ్గు ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కల్యాణపురంలో భారజల కర్మాగారానికి బొగ్గు సరఫరా అయ్యే రోప్‌వే బకెట్ నుంచి బొగ్గును అక్రమంగా తీసి జగ్గారంలో ఇటుక బట్టీలకు తరలిస్తుండగా క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవూఫ్ తెలిపారు.

ఇసుక లారీ..

మండల పరిధిలోని అమ్మగారిపల్లి గోదావరి నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని పోలీసులు శనివారం పట్టుకున్నారు. అమ్మగారిపల్లి గోదావరి నుండి లారీలో ఇసుక తరలిస్తుండగా గొల్లగూడెంలో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ వంతెన వద్ద పోలీసులు పట్టుకొని లారీని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్సై రవూఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

దమ్మపేట: జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రభుత్వమే నామినల్ ధరకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే జారే ఆదినారానాయణకు పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పీఎస్ఎస్‌పీ ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉద్యోగులు రిజిస్ట్రేషన్, బ్యాంకు రుణాలు పొందలేక పొంతున్నారన్నారు. హెచ్ఎం మస్తాన్ ఆలీ, ఉపాధ్యాయులు పవన్, హనుమంతరావు, సైదులు, విజయ్‌శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు రాక తిప్పలు

- పట్టించుకోని అధికారులు


బోరు దగ్గర నీరు పడుతున్న గ్రామస్తులు

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామంలో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో మూడు రోజులుగా భగీరథ నీరు రాకపోవడంతో గ్రామస్తులు బోర్ల దగ్గర నుండి నీరు తెచ్చుకుంటున్నారు. నీటి సమస్య గురించి మిషన్ భగీరథ సిబ్బందికి తెలియజేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో పాటు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పనులు సమయం కావడంతో ఉదయమే బోర్ల దగ్గరకి వెళ్లి నీల్లు తెచ్చుకుని వెళ్లే సరికి సమయం చాలా అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 50 ఇళ్లకు గాను ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకును సైతం మిషన్ భగీరథ సిబ్బంది పూర్తిగా నింపకుండా అరకొరగా నింపుతున్నారని ఒక్కోసారి ట్యాంకు నిండి నీళ్లు బయటకు పోతున్నాయని సిబ్బందికి చెప్పినా పట్టించుకోట్లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో అన్ని గ్రామాలకు మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం సాంబాయిగూడెం–పగిడేరు మార్గమధ్యంలో పేరంటాల చెరువు అలుగు చప్టా వద్ద బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నవీన్, శివ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పగిడేరు మాజీ సర్పంచ్ తాటి భిక్షం, కూచిపూడిబాబు, నాయకులు, అడపా వెంకటేశ్వర్లు, రవి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యంతోనే దేశాభివృద్ధి..

మణుగూరు రూరల్: దేశాభివృద్ధి మతసామరస్యంతోనే సాధ్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని పీవీకాలనీ(బొంబాయికాలనీ) మహమ్మదీయ మసీద్‌లో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఏరియా జీఎం దుర్గం రామచందర్ ముస్లింలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. షాదీఖానా నిర్మాణానికి సహకారం, చొరవ తీసుకోవడంపై ఎమ్మెల్యే, జీఎంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం డి.శ్యాంసుందర్, ఏజీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నయ్య త్యాగరాజన్, బ్రాంచి ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు, నాయకులు షేక్‌అబ్దుల్ రవూఫ్, షాబుద్దీన్, సూరపాక రాములు, మిద్దెపాక శ్రీనివాస్, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, సంతోష్ చరణ్ పాల్గొన్నారు.

ఇఫ్తార్‌విందు మత సామరస్యానికి ప్రతీక

- ఎమ్మెల్యే ఆదినారాయణ


చంద్రుగొండలో..


అశ్వారావుపేటరూరల్: ఇఫ్తార్‌విందులో ఎమ్మెల్యే జారె, తదితరులు


మణుగూరు రూరల్: బేస్ వర్క్‌షాప్‌లో..

అశ్వారావుపేటరూరల్: పవిత్రమైన రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్‌విందులు మత సామరస్యానికి ప్రతీకని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్థానిక మర్కస్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందుకు ఆయన హాజరై ప్రార్థనలు చేశారు. అనంతరం మండల పరిధిలోని కొత్త మామిళ్లవారిగూడెం గ్రామంలోని మసీదులో ఇఫ్తార్‌విందుకు హాజరయ్యారు. గ్రామ శివారులో గల ఖబరస్తాన్ మార్గమధ్యలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన చప్టాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంపీఓ సోయం ప్రసాద్, ఆర్ఐ కృష్ణ, సదర్ కమిటీ బాధ్యులు వలిపాషా, నజీర్, మత గురువు జాకీర్, అబ్దుల్ రెహమాన్‌బాబా, పఠాన్ జలాల్ ఖాన్, ఎండి.ముఖరం ఖాన్, జూపల్లి రమేష్‌బాబు, సొసైటీ అధ్యక్షులు సీహెచ్ సత్యనారాయణ, వీరభద్రరావు, తుమ్మా రాంబాబు పాల్గొన్నారు.

చంద్రుగొండ : మండలకేంద్రంలోని జమామసీద్‌లో హిందూముస్లింలు సంయుక్తంగా ఇఫ్తార్‌విందు నిర్వహించారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ.షమీహుసన్, యండీ ఖాజాహుసేన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, వేణు, భోగి కృష్ణ, వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి సురేష్, సంకా శంకర్, గోవిందరెడ్డి, పుల్లయ్య, భూపతి రమేష్, ఇమ్రాన్, వసీం పాల్గొన్నారు.

బేస్ వర్క్‌షాప్‌లో ..

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్‌మణుగూరు ఏరియాలోని బేస్‌వర్క్‌షాప్‌లో శనివారం మతసామరస్యం వెల్లివిరిసింది. రంజాన్ పర్వదిన సందర్భంగా హిందూ, క్రైస్తవ ఉద్యోగులు రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు పండ్లు పంపిణీ చేయగా, ముస్లింలు స్పెషల్ సేమియా విందు ఏర్పాటు చేశారు. బేస్ వర్క్‌షాప్ ఇన్‌చార్జి కె.సుదర్శన్‌రెడ్డి, నాయకులు మేకల ఈశ్వర్, సూరపాక రాములు, ఇంజనీర్లు శ్రీనివాస్, ఫోర్‌మెన్‌లు ఇమ్మానియేల్, శంకర్, అన్వర్, ఉద్యోగులు అబ్దుల్ రవూఫ్, జీవరత్నం, ఇసాక్, ఏఎస్ఎన్ ప్రసాద్, రాజయ్య, ఇమామ్, తాజుద్దీన్, గౌస్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, దీపక్ తదితరులు పాల్గొన్నారు

జమిలీ ఎన్నికలపై అవగాహన


మాట్లాడుతున్న కుంజా ధర్మా

చర్ల: జమిలీ ఎన్నికలతో కలిగే లాభాలను ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కుంజా ధర్మా, జిల్లా ఉపాధ్యక్షుడు పసుమర్తి సతీష్ అన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నికపై పార్టీ ఆధ్వర్యంలో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. దేశంలో ప్రతీ సంవత్సరం ఎన్నికలు నిర్వహించడమంటే ఆర్థిక సమస్యతో పాటు సమయం వృథా అవుతుందని, దీంతో అభివృద్ధికి విఘాతం కలుగుతుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నూపా రమేష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పాహీం బాబా, జిల్లా కార్యవర్గ సభ్యులు గూనూరి రమణ, నాయకులు రత్తయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి, గంజి వెంకట్, విశ్వనాథం, తరుణ్‌రెడ్డి, కుప్పా మాధవరావు, మల్లెల ప్రశాంత్, బోడిక గణేష్, మడివి శంకర్, పాడియం సమ్మయ్య, కారం రమేష్ ఉన్నారు.

జెండాల పంపిణీ

ములకలపల్లి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో శనివారం కాషాయ జెండాలను పంపిణీ చేశారు. బుజ్జి, వీహెచ్‌పీ మండల ఉపాధ్యక్షుడు పువ్వాల శ్రీనివాస్, జిల్లా సామరస్యతా ప్రముఖ్, గొడ్ల రాజు, బలిశెట్టి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

బూర్గంపాడు: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం సందర్భంగా శనివారం సారపాకలోని పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు, టీడీపీ మండల అధ్యక్షుడు తాళ్లూరి జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: స్థానిక రింగ్ రోడ్ సెంటర్లోలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. నాయకులు కట్రం స్వామి దొర, శ్రీనివాసరావు, బ్రహ్మం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలకేంద్రంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, కేక్‌ను కట్ చేశారు. సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, కొండల్‌రావు, శనగపాటి సుదర్శన్, కరుటూరి కృష్ణ, ప్రదీప్, సుధాకర్ ఉన్నారు.

చంద్రుగొండ: స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ, దడిగెల మల్లేష్, భీమయ్య ఉన్నారు.

అన్నపురెడ్డిపల్లి మండలకేంద్రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పానుగంటి రామారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

మణుగూరు టౌన్: 'మేం ఎంతో మాకు అంతే' అనే నినాదంతో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్వహించనున్న ఛలోఢిల్లీ కార్యక్రమ పోస్టర్లను నాయకులు శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆవిష్కరించారు. వీరంకి వెంకట్రావ్ గౌడ్, నాగారపు సతీష్, రుద్ర వెంకట్, ఐతన సత్యం, గురజాల గోపి, సోమేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

నూకాలమ్మ అవతారంలో దర్శనం


అలంకరణలో అమ్మవారు

అశ్వారావుపేటరూరల్: మండలపరిధిలోని వినాయకపురం శివారులోగల శ్రీ చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో అమ్మవారు శ్రీ నూకాలమ్మ అమ్మవారి అవతారంలో శనివారం భక్తులకు దర్శనం ఇచ్చారు. జాతర ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన, హోమాలు, పూజలు నిర్వహించారు. జాతర ఉత్సవాలు మూడో రోజుకు చేరగా, చూట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రాగా సందడి నెలకొంది.